క్లుప్తంగా

నేడు 'మాలల సింహగర్జన'

తిరుపతి కల్చరల్ : తెలంగాణలోని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం మాలల సింహగర్జన నిర్వహించనున్నట్లు దళిత సంఘం నేత మల్లారపు మధు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమానికి అన్నివర్గాలు అండగా నిలవాలని కోరారు. రాజకీయ లబ్ధి కోసం వర్గీకరణ పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు దుర్మార్గంగా మాల, మాదిగలను విడగొట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. భావితరాల కోసం దళితులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ప్రొఫెసర్‌కు సత్కారం


దేవప్రసాద్‌రాజును సత్కరిస్తున్న విజయభాస్కర్‌రావు

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఫిజిక్స్ విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ బి.దేవప్రసాద్‌రాజును నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్.విజయభాస్కరరావు శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఆర్‌పీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

డీసీటీఎం భాస్కర్‌రెడ్డికి సత్కారం


భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న డీపీటీఓ తదితరులు

తిరుపతి అర్బన్ : ఉద్యోగ విరమణ పొందిన ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్‌రెడ్డిని శనివారం ఆర్టీసీ డీపీటీఓ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. డీపీటీఓ జగదీష్ మాట్లాడుతూ క్రమశిక్షణకు మరోపేరు భాస్కర్‌రెడ్డి అని కొనియాడారు. మూడు దశాబ్దాలుగా ఆర్టీసీకి ఆయన సేవలు అందించారని తెలిపారు. నిత్యం అందరికీ అందుబాటులో ఉంటూ, వివాదరహితంగా విధులు నిర్వర్తించారని చెప్పారు. భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీలో సుదీర్ఘకాలం సేవలు అందించానని, ఎంతో సంతృప్తిగా ఉద్యోగ విరమణ పొందుతున్నానని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్టీసీ మెకానిక్ ఇంజినీర్ నరసింహులు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ డీఆర్ నాయుడు, డిపో మేనేజర్లు బాలాజీ, హరిబాబు, భాస్కరయ్య పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో ఎస్వీసీసీ విద్యార్థుల ప్రతిభ


ట్రోఫీ అందుకుంటున్న విద్యార్థులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన అంతర్‌కళాశాలల అథ్లెటిక్స్‌లో స్థానిక బాలాజీ కాలనీలో ఉన్న ఎస్వీసీసీ విద్యార్థులు సత్తా చాటి చాంపియన్ షిప్ సాధించారు. ప్రిన్సిపల్ నాగరాజా మాట్లాడుతూ తమ కళాశాలలో పిల్లలను విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. అథ్లెటిక్స్ బాలుర విభాగంలో వ్యక్తిగత చాంపియన్‌గా డి.సింధూర్ నిలవడం గర్వకారణమన్నారు. అలాగే ఓవరాల్ చాంపియన్‌గా కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రశంసించారు.

శాస్త్రోక్తంగా కాలభైరవ హోమం

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో శనివారం శాస్త్రోక్తంగా కాలభైరవస్వామి హోమం నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా చేపట్టిన హోమ మహోత్సవాల్లో భాగంగా యాగశాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పూజ, అష్ట భైరవ హోమం, మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన, మహాశాంతి అభిషేకం, కాలభైరవ మూలవర్లకు కలశాభిషేకం, నివేదన, హారతి సమర్పించారు. సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు చండికేశ్వరసామివారి కలశస్థాపన, పూజ, జపం, హోమం, విశేష దీపారాధన జరిపించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు పాల్గొన్నారు.

కరాటేలో 'బ్లూమింగ్ బడ్స్' విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ హితేంద్రనాథ్‌రెడ్డి

చంద్రగిరి : సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్–2024లో తమ బ్లూమింగ్ బడ్స్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు స్కూల్ చైర్మన్ హితేంద్ర నాథ్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన పోటీలకు దక్షిణ భారతదేశం నుంచి సుమారు 2వేల మంది క్రీడాకారులు పోటీ పడినట్లు వెల్లడించారు. అండర్–6 విభాగంలో 1వ తరగతి విద్యార్థి రెడ్డిపల్లి కేయాన్ బంగారు పతకం సాధించినట్లు చెప్పారు. అండర్–14లో 6వ తరగతి విద్యార్థిని రెడ్డిపల్లి వరీష ద్వితీయ స్థానంలో నిలిచినట్లు వివరించారు. ఈ మేరకు విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపల్ వేణుగోపాల్, కరాటే మాస్టర్ బాలాజీ పాల్గొన్నారు.

నేడు సంగీత నీరాజనం

తిరుపతి అర్బన్: శ్రీపద్మావతి వర్సిటీలో ఆదివారం కృష్ణవేణి సంగీత నీరాజనం నిర్వహించనున్నారు. శనివారం ఈ మేరకు టూరిజం జిల్లా అధికారి రమణ ప్రసాద్, నోడల్ అధికారి జ్యోతిర్మయి తెలిపారు.

సిరుల తల్లి వైభవం


జోరువానలోనూ మాడవీధుల్లో ముత్యపు పందిరి వాహనంపై విహరిస్తున్న అమ్మవారు

తిరుచానూరు పద్మావతీదేవి వార్షిక బ్రహ్మోత్సవాలు కనులపండువగా నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం అమ్మవారిని ముత్యపు పందిరి వాహనంలో ఊరేగించారు. రాత్రి సింహ వాహనంపై కొలువుదీర్చారు. కళాకారులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. – చంద్రగిరి


వాహనసేవలో కళాకారుల ప్రదర్శన

చినుకు.. వణుకు!


భారీ వర్షంలో విద్యాసంస్థలకు వెళుతున్న విద్యార్థినులు

- తిరుపతిలో ఎడతెరపి లేని వర్షం
- స్తంభించిన జనజీవనం
- లోతట్టుప్రాంతాలు జలమయం
- ఈదురుగాలుల బీభత్సం
- చలి తీవ్రతకు ఇంటికే పరిమితమైన ప్రజానీకం

తిరుపతి తుడా : ఫెంగల్ తుపాను కారణంగా తిరుపతిలో శనివారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. ఈదురుగాలులతోపాటు చలి తీవ్రత పెరగడంతో నగరవాసులు ఇళ్లకే పరిమితమయ్యారు. పాఠశాలలకు సెలవు లేకపోవడంతో విద్యార్థులు వానలో తడుస్తూనే స్కూళ్లకు వెళ్లాల్సి వచ్చింది. జోరువాన నేపథ్యంలో జన జీవనం దాదాపు స్తంభించింది.

లోకట్టు ప్రాంతాలు జలమయం

తిరుపతి, తిరుమలలో భారీ వర్షపాతం నమోదైంది. నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. అలానే కపిల తీర్థం కాలువ, మాల్వాడిగుండం, మజ్జిగ కాలువ మహిళా యూనివర్సిటీ ప్రాంతాల్లో ప్రవహించే పెద్ద కాలువలు ఉప్పొంగి ప్రవహించాయి. మురుగుకాలువల్లో వర్షపు నీరు చేరడంతో రోడ్లపైకి ప్రవహించాయి. మధురానగర్, మాధవ నగర్, కొర్లగుంట, చంద్రశేఖర రెడ్డి కాలనీ, కట్టకిందపల్లె, కొరమేను గుంట, ఆటో నగర్, ఎమ్మార్‌పల్లె, శివజ్యోతి నగర్, ఎరమ్రెట్ల తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. కాలువల్లో వ్యర్థాలను తొలగింపు ప్రక్రియను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

పెనుగాలులు

తుపాను ప్రభావంతో పెనుగాలులు వీచాయి. గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడంతో నగర ప్రజలు ఆందోళన చెందారు. కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల ముందు వేసిన పందిళ్లు, కంచెలు, రేకులు ఎగిరిపోయాయి. మరి కొన్ని ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి.

క్షేత్రస్థాయిలో పరిశీలన

నగరంలో శనివారం వేకువజాము నుంచి కమిషనర్ మౌర్య క్షేత్రస్థాయిలో పర్యటించారు. న్నమయ్య కూడలి, కలెక్టర్ బంగ్లా రోడ్డు, ముత్యాలరెడ్డిపల్లె, వెస్ట్ చర్చి రోడ్డులో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. తుపాను నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కమిషనర్ వెంట ఎంఈ తులసి కుమార్, తుడా ఈఈ రవీంద్ర, డీఈ మహేష్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య ఉన్నారు.

హెల్ప్ లైన్ నంబర్లు

తుపాను సహాయక చర్యల కోసం కార్పొరేషన్ అధికారులు హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు చేశారు. ఎవరికైనా ఇబ్బందులు తలెత్తితే 90008 22909, 0877 2256766 నంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలని కమిషనర్ కోరారు.


విధి నిర్వహణకు వెళుతున్న నర్సులు


పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ మౌర్య

అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్విమ్స్ డైరెక్టర్

తిరుపతి సిటీ : ఎయిడ్స్ నివారణ అవగాహనతోనే సాధ్యమని ఎస్పీడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ తెలిపారు. శనివారం పద్మావతి డిగ్రీ కళాశాలలో డిసెంబర్ 1వ తేదీ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మానవహారం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ వైరస్ ద్వారా ఎయిడ్స్ సంక్రమిస్తుందని, వ్యక్తిగత క్రమశిక్షణ, మంచి అలవాట్లతో ఇలాంటి వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ వ్యాధి సోకిన తర్వాత బాధపడడం కంటే రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ దివ్యవాణి, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ మల్లేశ్వరి దేవి, అధ్యాపకులు కేవీ పద్మజ, నళిని, కుముదిని, కస్తూరి, సుధాకర్ పాల్గొన్నారు.

స్విమ్స్‌లో..

తిరుపతి తుడా : స్విమ్స్ ఆస్పత్రిలో శనివారం ఘనంగా ప్రపంచ ఎయిడ్స్ డే నిర్వహించారు. స్విమ్స్ డైరెక్టర్, వీసీ ఆర్‌వీ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెంపొందించుకుని ఎయిడ్స్ రహిత దేశంగా రూపుదిద్దేందుకు కృషి చేయలని పిలుపు నిచ్చారు. కార్యక్రమలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉషా కళావత్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజు, ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె మాధవి, నర్సింగ్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ స్వర్ణ, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ లలిత్, అజిత పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

తిరుపతి తుడా : నగరంలో శనివారం సామాజిక పింఛన్ల పంపిణీ చేపట్టారు. కార్పొరేషన్ పరిధిలో మొత్తం 18,992 మందికి గాను 18,227 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ మేరకు ప్రక్రియను కమిషనర్ మౌర్య క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ తొలిరోజు 95.97శాతం పింఛన్లను లబ్ధిదారులకు అందించినట్లు వెల్లడించారు.

అలరించిన సంకీర్తనలు

తిరుపతి కల్చరల్ : తిరుచానూరు పద్మావతీదేవి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తిరుపతిలోని రామచంద్ర పుష్కరిణి వద్ద తాళ్లపాక నారాయణాచార్యులు ఆలపించిన అన్నమయ్య సంకీర్తలు భక్తులను అలరించాయి. ఆయన మధురంగా గానం చేసిన సంకీర్తనలకు వయోలిన్‌తో శిరినాథ్, తబలాతో రెడ్డిశంకర్, శృతికి శ్రీనివాసులు సహకారం అందించారు.

గురజాడకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న చిగోరా ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : మహాకవి గురజాడ అప్పారావు 109వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. రాముల వారి దక్షిణ మాడ వీధిలోని చిగోరా ఆధ్యాత్మిక కేంద్రంలో గురజాడ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. చిగోరా ఆధ్యాత్మిక కేంద్ర వ్యవస్థాపకుడు చిత్రపు హనుమంతరావు, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారుడు గురజాడ అప్పారావు అని కొనియాడారు. ఆయన రచించిన కన్యాశుల్కం నాటకానికి సమాజంలో ప్రత్యేకమైన స్థానం ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌కే శేషగిరిరావు, విజయభాస్కర్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, రామలింగేశ్వరకుమార్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ


పుస్తకాలు ఆవిష్కరిస్తున్న టీటీడీ ఈఓ తదితరులు

చంద్రగిరి : తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం నిర్వహించిన ముత్యపు పందిరి వాహన సేవలో పలు ఆధ్యాత్మిక పుస్తకాలను టీటీడీ ఈఓ శ్యామలరావు ఆవిష్కరించారు. ఆచార్య సర్వోత్తమరావు రచించిన భాగవత గాథలు, ఆచార్య సుమతీ నరేంద్ర రచించిన మహాభారత గాథలు, ఆచార్య కోలవెన్ను మలయవాసిని రచించన రామాయణ గాథలు, శ్రీవావిలికొలను సుబ్బారావు రచించిన ఆర్యకథానిధి పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి ఆకెళ్ల విభీషణ శర్మ, ఉప సంపాదకుడు నరసింహాచార్య పాల్గొన్నారు.

పట్టాలు సృష్టించి.. పచ్చనేతల కబ్జా


ఆక్రమిత స్థలంలో వేసిన ఫెన్సింగ్, నిర్మించిన షెడ్డు

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి టీడీపీ నేతల అక్రమాలకు అంతే లేకుండా పోయింది. సర్కారు భూములను పచ్చముఠా యథేచ్ఛగా దిగమింగేస్తోంది. నకిలీ పట్టాలు సృష్టించి దందా సాగిస్తోంది. రూ.కోట్ల విలువైన స్థలాలను దర్జాగా కబ్జా చేసేస్తోంది. బినామా పేర్లతో కనిపించిన భూములను కాజేస్తోంది. ఈ క్రమంలోనే రెవెన్యూ యంత్రాంగం సైతం అక్రమార్కులకు అండగా నిలుస్తోంది. అధికార పార్టీ నాయకుల ఆక్రమణలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా.. చూసీ చూడనట్టు వ్యవహరిస్తోంది. ఈ మేరకు పచ్చగద్దల భూదాహానికి ఏ.రంగంపేట మార్గంలోని రూ.6కోట్ల తోపు పోరంబోకు అన్యాక్రాంతమవుతోంది.

- రూ.6 కోట్ల విలువైన భూమి స్వాహా
- షెడ్డు నిర్మించి.. ఫెన్సింగ్ వేసి ఆక్రమణ
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు

చంద్రగిరి : మండలంలోని ఏ.రంగంపేట మార్గంలో అటవీశాఖ బంగ్లాకు కూతవేటు దూరంలోనే టీడీపీ నేతలు భారీ భూ కబ్జాకు తెరలేపిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సర్వే నంబరు 80/ఏలో సుమారు 8.30 సెంట్ల ప్రభుత్వ తోపు పోరంబోకు ఉంది. రహదారికి అనుకుని ఉన్న పోరంబోకు భూమికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. దీంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ భూమిని కాజేసేందుకు కొంత మంది యత్నించగా, అప్పటి రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఆ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూమి పరులపాలు కాకుండా చర్యలు తీసుకున్నారు.

కూటమి రాగానే..!

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడగానే భూ కబ్జాదారులు పడగవిప్పారు. ఈ పర్యాయం పక్కా స్కెచ్‌తో కబ్జాకు పాల్పడినట్లు తెలుస్తోంది. గతంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును వదిలేసి, వాటికి వెనుక వైపున ఉన్న ప్రభుత్వ భూమిని కాజేయాలని పన్నాగం పన్నారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం నకిలీ పత్రాలను సృష్టించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆపై కొంత మంది టీడీపీ నాయకులు సిండికేట్‌గా మారి తోపు బోరంబోకును పంపకాలు చేసుకున్నట్లుగా వెల్లడిస్తున్నారు. అందులో చిన్నపాటి షెడ్డు నిర్మాణాలను చేపట్టి, చుట్టూ ప్రహరీలాగా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

కనిపించని స్పందన

తిరుపతి–మదనపల్లె జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఈ విలువైన భూమిని కాజేసేందుకు రెవెన్యూ అధికారులు సైతం పరోక్షంగా సహకరించినట్లుగా స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారుల్లో ఎలాంటి స్పందన కనిపించడం లేదని మండిపడుతున్నారు.

విచారణ చేపడతాం

అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వ భూమి అవసరం. ఏ.రంగంపేట సమీపంలోని ప్రభుత్వ పోరంబోకు ఆక్రమణలకు గురైనట్లు ఫిర్యాదులు అందాయి. దీనిపై విచారణ చేపడతాం. ఆక్రమణదారులకు నోటీసులు అందజేసి, చర్యలు తీసుకుంటాం.

– శివరామసుబ్బయ్య, తహసీల్దార్, చంద్రగిరి